


# యోగ్యుడు (యోగ్యత)

**యేసయ్య అద్వితీయమైన నామమునకు మహిమ కలుగును గాక!**

**మూల వాక్యము:** ప్రకటన: 5:4,5 ఆ గ్రంథము విప్పుటకైనను చూచుటకైనను యోగ్యుడెవడును కనబడనందున నేను బహుగా ఏడ్చుచుండగా ఆ పెద్దలలో ఒకడు ఏడువవకుము; ఇదిగో దావీదుకు చిగురైన యూదా గోత్రపు సింహము ఏడు ముద్రలను తీసి ఆ గ్రంథమును విప్పుటకై జయముపొందెనని నాతో చెప్పెను.

**ఏదైనా ఒక పనిని గాని, ఒక బాధ్యతనుగాని ఒక వ్యక్తికి అప్పగించాలన్నా, ఏదైనా ఇవ్వాలన్నా, సహాయము చేయాలన్నా ఆ వ్యక్తికి, ఆ పనిని, బాధ్యతను సక్రమముగా నిర్వర్తించ గల సామర్థ్యము కలిగి ఉండటాన్ని యోగ్యత అంటాం. ఇతరులకు యోగ్యత లేదని COMMENT చేస్తుంటాము. మనకు ఉన్నంత యోగ్యత మరి ఎవరికీ లేదని మనం అనుకుంటాం. అందుకే దావీదు మహారాజు అయోగ్యుడను అని అపాత్రుడను అని ప్రార్ధన చేశాడు.మనం అలాంటి ప్రార్థన నేర్చుకోవాలి. యోగ్యత గురించి పరిశుద్ధ గ్రంథము ఏమి నేర్పిస్తుందో చూదాం.**

**యోగ్యుడు ఎవడు?**

1. **యోగ్యత తెలుసుకోవాలి : 2 కొరింథి 2:9** మీరన్ని విషయములందు విధేయులై యున్నారేమో అని **మీ యోగ్యత తెలిసికొనుటకే** గదా పూర్వము వ్రాసితిని.

   **అంటే విధేయత లేని వారు అయోగ్యుడని అర్థం.**

2. **యోగ్యత ఎరగాలి: ఫిలిప్పి 2:22** అతని **యోగ్యత మీరెరుగు దురు.** తండ్రికి కుమారుడేలాగు సేవచేయునో ఆలాగే అతడు నాతోకూడ సువార్త వ్యాపకము నిమిత్తము సేవ చేసెను

   **సేవలో సేవకునికి, సువార్త వ్యాప్తి నిమిత్తం కుమారులు స్వంత తండ్రికి చేసినట్లు చేయడం యోగ్యత.**

3. **యోగ్యత మీద ధ్యానముంచాలి: ఫిలిప్పి 4:8** మెట్టుకు సహోదరులారా, యే **యోగ్యతయైనను** మెప్పైనను ఉండినయెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్య మైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, **వాటిమీద ధ్యాన ముంచుకొనుడి.**

   **ఇక్కడ ధ్యానము అన్నప్పుడు ధ్యాస,మనస్సు,లక్ష్యము,అని గుర్తుంచుకోవాలి. అలాంటి వాంఛ,కాంక్ష కలిగిన వాడే యోగ్యుడు.**

4. **యోగ్యత కనబడాలి: 2 కొరింధీ 9:13** ఏలాగనగా క్రీస్తుసువార్తను అంగీకరింతుమని ఒప్పుకొనుట యందు మీరు విధేయులైనందుచేతను, వారి విషయమును అందరి విషయమును ఇంత ఔదార్యముగా ధర్మము చేసి నందుచేతను, ఈ పరిచర్య మూలముగా మీ **యోగ్యత కనబడినందున** వారు దేవుని మహిమపరచుచున్నారు.

   **కొరింథీ సంఘం వారు మొదట అవిధేయులుగా ఉన్నను క్రమేపి అపోస్తలుని నడిపింపులో విధేయత కలిగి, పరిచర్యలో యోగ్యతను కనుపరచి దేవుని మహిమపరిచారు. ఇదే యోగ్యత.**




## *ఎవరు దేనికి యోగ్యులు:*

1. **అతడు మేలు పొందుటకు యోగ్యుడు: లూకా 7:4** వారు యేసునొద్దకు వచ్చినీవలన ఈ మేలు పొందుటకు అతడు (శతాధిపతి) యోగ్యుడు. శతాధిపతి దేవుని ప్రజలను ప్రేమించి వారి పట్ల ఆశ కలిగి వారికి సమాజ మందిరమును కట్టించాడు. కనుక క్రీస్తు వలన **మేలు పొందటానికి యోగ్యుడని** శిష్యులు సాక్ష్యం పలికారు.
2. **సువార్త అప్పగించుటకు యోగ్యుడు: 1థెస్స 2:4 సువార్తను మాకు అప్పగించుటకు యోగ్యులమని** దేవునివలన ఎంచబడిన వారమై, మనుష్యులను సంతోషపెట్టువారము కాక మన హృదయములను పరీక్షించు దేవునినే సంతోషపెట్టు వారమై బోధించుచున్నాము.

   **మనుష్యులను కాక ఎవరైతే దేవునిని సంతోష పెడతారో వారికి సువార్తను అప్పగించుట యోగ్యం.**
3. **తీర్పు తీర్చుటకు యోగ్యత:1 కొరింథి 6:2** పరిశుద్ధులు లోకమునకు తీర్పు తీర్చుదురని మీరెరుగరా? మీవలన లోకమునకు తీర్పు జరుగవలసి యుండగా, మిక్కిలి అల్ప మైన సంగతులనుగూర్చి **తీర్పు తీర్చుటకు మీకు యోగ్యత లేదా?** పరిశుద్ధ జీవితం కలిగి ఉంటే రాబోవు యుగంలో లోకమునకు తీర్పు తీర్చే యోగ్యతను సంపాదించు కుందుమని గ్రహిద్దాం.
4. **నీవు యోగ్యురాలవని నా జనులందరు ఎరుగుదురు: రూతు 3:11** కాబట్టి నా కుమారీ, భయపడకుము; నీవు చెప్పినదంతయు నీకు **చేసెదను నీవు యోగ్యురాలవని నా జనులందరు ఎరుగుదురు.**

   **రూతు తన మాటలు, ప్రవర్తనను బట్టి జనులందరి చేత యోగ్యురాలని సాక్ష్యం సంపాదించుకుంది. ప్రతి యౌవ్వన సహోదరి ఇలాంటి సాక్ష్యం సంపాదించుకోవాలి.**
5. **ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడు: 2 కొరింథి 10:18 ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడు** గాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు.

   **తన గురించి తాను గొప్పలు చెప్పుకొనే వాడు యోగ్యుడు కాదు. దేవుడు మెచ్చుకోవాలి. కొంత మంది వారి గొప్పలు చెప్పుకోడానికి చెంచా రాయుళ్లను పెట్టుకుంటారు. ఇది కూడా యోగ్యత కాదు.**

## *ఎవరు దేనికి యోగ్యులు కారు:*

1. **ఆయన చెప్పుల వారును విప్పుటకైనను నేను యోగ్యుడను కాను: యోహాను 1:27** మీరాయన నెరుగరు, **ఆయన చెప్పుల వారును విప్పుటకైనను నేను యోగ్యుడను కానని** వారితో చెప్పెను సాక్ష్యం.

   బాప్తిస్మమిచ్చే యోహాను యేసు క్రీస్తు గురించి చెప్పిన సాక్ష్యం. నేను అయోగ్యుడను అని ఒప్పుకోవడం ద్వారా యోగ్యతను సంపాదించుకుంటాం.
2. **నీ కుమారుడనని అని పించుకొనుటకు యోగ్యుడను కాను: లూకా 15:19** ఇకమీదట **నీ కుమారుడనని అని పించుకొనుటకు యోగ్యుడను కాను**; నన్ను నీ కూలి వారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదు ననుకొని లేచి తండ్రియొద్దకు వచ్చెను.

తప్పిపోయిన కుమారుడు తండ్రితో పోట్లాడి ఆస్తి పంచుకొని వేశ్యలతో పాడు చేసి, తిండి లేక చనిపోయే స్థితిలో తిరిగి వచ్చి తండ్రి దగ్గర చేసిన మనవి ఒప్పుకోలు. ఇక కుమారుడు అనిపించుకోవటానికి నాకు యోగ్యత లేదు. కూలివాండ్ర లో ఒకనిగా పెట్టుకోమన్నాడు. అందుకే కుమారునిగా తిరిగి స్థానం పొందాడు.

3. **అపొస్తలుడనబడుటకు యోగ్యుడనుకాను:** **1 కొరింథీ 15:9** ఏలయనగా నేను అపొస్తలులందరిలో తక్కువవాడను దేవుని సంఘమును హింసించినందున **అపొస్తలుడనబడుటకు యోగ్యుడను కాను.**

పౌలుగా మారిన సౌలు, ఒకప్పుడు సంఘమును హింసించిన కారణం గా నేను అపోస్తలుడు (అనగా యేసు క్రీస్తు శిష్యుడు గా పిలవబడుటకు)యోగ్యుడను కాను అన్నాడు. కనుకనే వారితో కూడా అపోస్తలుడుగా ఎంచబడ్డాడు.

4. **అట్టివారికి ఈ లోకము యోగ్యమైనది కాదు:** **హెబ్రీ 11:38** అడవులలోను కొండలమీదను గుహలలోను సొరంగములలోను తిరుగులాడుచు సంచరించిరి. **అట్టివారికి ఈ లోకము యోగ్యమైనది కాదు.**

సేవ కోసం చాలా మంది ఈ లోకంలో హింసలు పొందారు.మహా శ్రమలను అనుభవించారు.ఒరిస్సా రాష్ట్రం లో ఒక NUN(వివాహం చేసుకోకుండా దేవుని సేవకు సమర్పించుకున్న ఒక స్త్రీ)ని 5 మంది పైశాచికంగా మానభంగము చేశారు. ఏలయనగా యెరూషలేము మీద యుద్ధము చేయుటకు నేను అన్యజనులందరిని సమకూర్చబోవుచున్నాను; పట్టణము పట్టబడును, ఇండ్లు కొల్ల పెట్టబడును, స్త్రీలు చెరుపబడుదురు, పట్టణములో సగముమంది చెర పట్టబడి పోవుదురు; అయితే శేషించువారు నిర్మూలము కాకుండ పట్టణములో నిలుతురు జెకర్యా 14:2లో చెప్పబడినట్లుగా అట్టివారికి ఈ లోకం యోగ్యం కాదు. అంటే పరలోకమే యోగ్యం అని అర్థం.

సహోదరా ! సహోదరి ! మరి మీ యోగ్యత ఏంటి? అన్యులమైన మనలను యూదా గోత్రములోనికి ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు వంశములోనికి ప్రభువు చేర్చుకున్నారు. శరీరానికి సున్నతి లేకుండా హృదయానికి సున్నతి దయచేసి మనలను మార్చుకున్నారు. పాపులమైన మనల్ని ఆయన రక్తంలో కడిగి పరిశుద్ధులుగా, నీతిమంతులుగా మార్చుకున్నారు. ఆయన పేరును కుడా ఉచ్చరించడానికి అధికారం లేని మనలను ఆయన కుమారులనుగా, కుమార్తెలుగా మార్చుకున్నారు. శ్రేష్ఠమైన నామాన్ని ఇచ్చారు. పరలోకరాజ్యాన్ని స్వాస్థ్యంగా ఇచ్చారు. ఎన్నికలేని మనలను, తృణీకరింపబడ్డ మనలను, ఆయన సొత్తుగా మార్చుకున్నారు. పరలోకంలో ఆయన సింహాసనాన్ని, ఆయన కుడిపార్శ్వమున స్థానాన్ని మనకు ఇచ్చారు. అయోగ్యులైన మనకు ఎంత యోగ్యత వచ్చింది. **క్రీస్తు చిందించిన రక్తము వలన ఈ Lentలో మన అయోగ్యత యోగ్యతగా మారుతుంది. కనుక ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యం చేయకుండా జాగరూకులై ఉండడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక ! ఆమెన్ ఆమెన్ ఆమెన్.**